సాక్షి
నారాయణపేట
ఆదివారం, 12, అక్టోబర్, 2025



ఫైనల్లో పాలమూరు- పేట

జిల్లాకేంద్రంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో మహబూబ్‌నగర్- పేట జట్లు తుది పోరులో తలపడనున్నాయి. -8లో ▸



..62 వేల క్యూసెక్కులు

జూరాల ప్రాజెక్టుకు శనివారం రాత్రి 8.30 ప్రాంతంలో 62 వేల క్యూసెక్కుల వరద చేరినట్లు అధికారులు తెలిపారు. -8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.2 /18.0

మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత కాస్త కనిపిస్తుంది. రాత్రిళ్లు చలిగా ఉంటుంది. ఆకాశం అప్పడప్పుడు మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

అభిప్రాయంతోనే డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక



నారాయణపేట: 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమం ద్వారా క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ నాయకులు, పార్టీ ప్రతినిధుల అభిప్రాయాలతోనే డీసీసీ అధ్యక్షుడి నియామకంపై ఏఐసీసీ నేతృత్వంలో టీపీసీసీ ఆధ్వర్యంలో తుది నిర్ణయం తీసుకుంటుందని ఏఐసీసీ పరిశీలకులు, ఎమ్మెల్సీ నారాయణస్వామి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా, బ్లాక్, మండల సీనియర్ నాయకులతో డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ స్వామి మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో ప్రత్యక్షంగా సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకొని ఈ నెల 22న ఏఐసీసీకి నివేదిక అందజేస్తామన్నారు. 13, 14, 15 తేదీల్లో జిల్లా కేంద్రంలోనే ఉండి గ్రూపులు, వ్యక్తిగతంగా పార్టీలోని అందరి అభిప్రాయలు సేకరిస్తామన్నారు. డీసీసీ ఎన్నికల్లో అరుగురు అభ్యర్థులు పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకులు సమావేశంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ పార్టీ పునర్నిర్మాణ దిశగా ముందడుగు వేస్తుందన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు తప్పకుండా పదవులు వస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర మత్స్య సహకార శాఖ అధ్యక్షుడు మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన అతి సామాన్య కుటుంబానికి చెందిన తనను సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించి అతి చిన్న వయస్సులో రాష్ట్ర చైర్మన్ పదవి కట్టబెట్టారన్నారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ ఆర్ శివారెడ్డి, పోషల్ రాజేష్ కుమార్, మధుసూదన్‌రెడ్డి, ప్రసన్నరెడ్డి, ఎండీ సలీం, బండి వేణుగోపాల్, సరాఫ్‌నాగరాజు, సుధాకర్, మనోహర్‌గౌడ్ పాల్గొన్నారు.

'హిందుత్వం జీవన విధానం'

నారాయణపేట టౌన్: హిందుత్వం జీవన విధానమని, సనాతన ధర్మంతో విశ్వశాంతి చేకూరుతుందనిసంస్కార భారతి ప్రాంత సహ కార్యదర్శి చక్రవర్తి వేణుగోపాల్ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన పథ సంచలన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడి వందేళ్ల పూర్తయినా సందర్భంగా దేశ వ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం సాయత్రం 4.30 గంటలకు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు యూనిఫాం ధరించి జిల్లా కేంద్రంలోని పరిమళపూర్ హనుమాన్ మందిరం నుంచి కవాతు ప్రారంభించి సరాఫ్ బజార్, సెంటర్ చౌక్, సుభాస్ రోడ్, వీరసావర్కర్ చౌరస్తా, సత్యనారాయణ చౌరస్తా, కొత్త బస్టాండ్ మీదుగా ర్యాలీ కొనసాగించి శ్రీగార్డెన్‌కు చేరుకున్నారు. సంఘ్ సేవకులు చేసిన కవాతు చూపరులను ఆకట్టుకుంది. ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకు పట్టణ యువత పూలతో అడుగడుగునా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ దేశ అభివృద్ధి, హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో వరలక్ష్మి సరోదే, నగర సంఘ చాలక్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



డీసీసీ అధ్యక్షులపై కసరత్తు

- జిల్లాలకు ఏఐసీసీ పరిశీలకులు
- పార్టీ శ్రేణుల నుంచి అభిప్రాయ సేకరణ
- ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 18 వరకు కొనసాగనున్న ప్రక్రియ
- ఒక్కో జిల్లాకు ఆరుగురి పేర్లతో ప్రతిపాదన
- 5 జిల్లాల్లోనూ పలువురి మధ్య పోటాపోటీ



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే, స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ రద్దుతో ఆశావహుల్లో నైరాశ్యం అలుముకుంది. ఇదే క్రమంలో సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టడం.. ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న డీసీసీ అధ్యక్ష పీఠాల భర్తీకి కసరత్తు ప్రారంభించడంతో పార్టీలో మళ్లీ సందడి మొదలైంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల ఖరారుకు సంబంధించి ఏఐసీసీ పరిశీలకులుగా నియమితులైన వారు జిల్లాల బాట పట్టారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పరిశీలకుడు కర్ణాటక ఎమ్మెల్సీ నారాయణస్వామి శనివారం పాలమూరుకు చేరుకున్నారు. ముందుగా నారాయణపేటలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఆ తర్వాత మహబూబ్‌నగర్‌కు చేరుకుని స్థానిక నేతలతో ముచ్చటించారు. ఆదివారం నుంచి ఈ రెండు జిల్లాల్లో అభిప్రాయాల సేకరణతో పాటు డీసీసీ అధ్యక్షుల ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. అదేవిధంగా మరో పరిశీలకుడు పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణ స్వామి ఆదివారం నాగర్‌కర్నూల్, 14న వనపర్తి, 16న జోగుళాంబ గద్వాలలో పర్యటించనున్నారు.

నవంబర్‌లో ఖరారయ్యే అవకాశాలు

ఏఐసీసీ పరిశీలకులు ఆయా జిల్లాల్లో పర్యటిస్తూ డీసీసీ అధ్యక్షులుగా ఎవరిని నియమిస్తే బాగుంటుందని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించనున్నారు. అదేవిధంగా అధ్యక్ష పదవులను ఆశిస్తున్న నేతల నుంచి ఈ నెల 18వ తేదీ దాకా దరఖాస్తులు స్వీకరించనున్నారు. వడబోత తర్వాత ఒక్కో జిల్లాకు ఆరుగురి పేర్లతో ఈ నెల 22వ తేదీ నాటికి అటు ఏఐసీసీ, ఇటు పీసీసీకి అందజేయనున్నారు. అనంతరం సీఎం ఇతర ముఖ్య నేతలు జిల్లా ఇన్‌చార్జిలు, ఇన్‌చార్జి మంత్రులు, ఆయా జిల్లాల నుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులతో సంప్రదింపులు జరిపి సామాజిక వర్గాల (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్, మహిళ) వారీగా పార్టీ జిల్లా అధ్యక్ష పదవులను కేటాయించనున్నారు. మొత్తానికి వచ్చే నెల తొలివారంలో డీసీసీ అధ్యక్షులు ఖరారు కానున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఆశావహులు తాము చేసిన దరఖాస్తుల్లో పార్టీకి అందించిన సేవలు, అనుభవం, గతంలో నిర్వర్తించిన బాధ్యతలు తదితర వివరాలను స్పష్టంగా పేర్కొంటూ బయోడేటా ఇవ్వాలని పరిశీలకులు సూచిస్తున్నారు.

జిల్లాల వారీగా పోటాపోటీ ఇలా..

■ మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి డీసీసీ చీఫ్‌గా ఉన్నారు. ఆయనతో పాటు ఈ పదవి కోసం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకుడు ఎన్పీ వెంకటేష్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, డీసీసీ ప్రధానకార్యదర్శి సిరాజ్‌ఖాద్రి పోటీపడుతున్నారు.

■ వనపర్తి జిల్లాకు సంబంధించి ప్రధానంగా ముగ్గురి మధ్య పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. లక్కాకుల సతీష్, రాజేంద్రప్రసాద్, డి.కిరణ్ కుమార్ డీసీసీ పదవిపై ఆశలు పెట్టుకున్నారు.

■ జోగుళాంబ గద్వాల జిల్లాలో మూడు వర్గాల మధ్య డీసీసీ పదవికి పోటీ నెలకొంది. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వర్గంలోని గద్వాలకు చెందిన గడ్డం కృష్ణారెడ్డి, మల్దకల్ మండలానికి చెందిన పటేల్ ప్రభాకర్‌రెడ్డి.. జెడ్పీ మాజీ అధ్యక్షురాలు సరిత భర్త తిరుపతయ్య, మల్దకల్‌కు చెందిన నల్లారెడ్డి పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఏఐసీసీ నాయకుడు సంపత్‌కుమార్.. సరిత వర్గంలోని నల్లారెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది.

■ నారాయణపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి ఉన్నారు. మరికల్ మండలం తీలేరుకు చెందిన ఆయనతో పాటు మక్తల్ మండలానికి చెందిన బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, ధన్వాడ మండలంలోని గోటూరు నాగేశ్వర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలానికి చెందిన మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ప్రసన్నరెడ్డి, కోస్గి మండలం పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మద్దూరు మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి సైతం డీసీసీ పదవిపై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

■ నాగర్‌కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఉన్నారు. ప్రస్తుతం డీసీసీ అధ్యక్ష పదవిపై పార్టీ మైనార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు హబీబ్, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్‌కుమార్ రెడ్డి, కొల్లాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాము యాదవ్ ఆశలు పెట్టుకున్నట్లు తెలిసింది.

ఆధునిక హంగులు

పీయూలో కొత్త పుంతలు తొక్కుతున్న పరిపాలన



పీయూలో నిర్మిస్తున్న సీవేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్

- ఆన్‌లైన్‌లో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థుల వివరాలు
- విద్యుదుత్పత్తి కోసం సోలార్ ప్యానెల్స్ బిగింపు
- రూ.5 కోట్లతో సీవేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు
- నీటి పునర్వినియోగం, వ్యర్థాలతో బయో ఫర్టిలైజర్స్ తయారీ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఆటుపోట్లను దాటుకుంటూ.. ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ వినూత్నంగా ముందుకెళ్తోంది. ప్రస్తుత వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పీయూలో పరిపాలన కొత్త పుంతలు తొక్కుతోంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సమర్థ్ స్కీం పోర్టల్ ద్వారా సిబ్బందికి ఆన్‌లైన్ అటెండెన్స్, వర్క్‌లోడ్, పే స్లిప్‌ల వంటివి అందిస్తున్నారు. వీటితోపాటు పీయూలో వినియోగిస్తున్న నీటి పునర్వినియోగం కోసం నూతనంగా సీవేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మిస్తున్నారు. అలాగే అడ్మినిస్ట్రేషన్ భవనంపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఆదా చేయడంతోపాటు పర్యావరణ పరిరక్షణలో తమవంతు భాగస్వామ్యం అవుతున్నారు.

సమర్థ్ పోర్టల్‌తో సేవలు..

పీయూలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి సెలవుల మంజూరు, వేతనాల పే స్లిప్‌లు, విద్యార్థి అడ్మిషన్, అటెండెన్స్, స్కిల్స్ తదితర అంశాలను పొందుపర్చుకోవడం, వివిధ కార్యక్రమాలు, హాస్పిటల్స్ తదితర అంశాలను మ్యానువల్ పద్ధతిలో జరిగేవి. దీనిని ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొచ్చి సమగ్రంగా యూనివర్సిటీతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరికి అందించేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. పీఎం ఉషా స్కీం నిధులను అందిస్తున్న ప్రతి ప్రభుత్వ విద్యా సంస్థకు కేంద్రం సమర్థ్ పోర్టల్‌ను ఉచితంగా అందిస్తుంది. ఈ స్కీంలో భాగంగా యూనివర్సిటీ సిబ్బందికి ప్రత్యేకంగా సమర్థ్ యాప్ ద్వారా ప్రత్యేక సేవలను అందించేందుకు అధికారులు ఇటీవల ట్రయల్స్ నిర్వహించారు. ఇందులో రెగ్యులర్ అధ్యాపకులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయగా.. కాంట్రాక్టు అధ్యాపకుల వివరాలను ఈ పోర్టల్ దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. అనంతరం నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థులనూ ఇందులో చేర్చనున్నారు. తద్వారా పీయూకు సంబంధించిన ప్రతి ఫైల్ కూడా ఈ-పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫైలింగ్ నిర్వహించి.. ఫైల్ స్టేటస్ ఎక్కడ.. ఏ అధికారి వద్ద ఉందో తెలుసుకునే అవకాశం లభిస్తుంది.

కీలకంగా సీవేజ్ ప్లాంట్..

యూనివర్సిటీలో గత కొన్నేళ్లుగా తీసుకువస్తున్న మార్పుల్లో కీలకమైంది సీవేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్. రూ.5 కోట్ల వ్యయంతో సింథటిక్ ట్రాక్ కిందభాగంలో దీనిని నిర్మిస్తున్నారు. యూనివర్సిటీలో పలు హాస్టల్స్, కళాశాలలు నుంచి వచ్చే డ్రెయినేజీ నీటిని ఇక్కడ ఉండే పెద్ద మూడు ట్యాంకుల్లోకి మళ్లించి నీటితోపాటు ఇతర వ్యర్థాలను శుద్ధి చేసే విధంగా సీవేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనిచేస్తుంది. ఇందులో శుద్ధి చేసిన నీటిని తిరిగి చెట్లు, తోటలు, గార్డెన్లకు, ఘన పదార్థాల వ్యర్థాలను బయో ఫర్టిలైజర్‌గా వినియోగిస్తున్నారు. చెట్లకు ఇతర అవసరాల కోసం ఎరువులుగా ఉపయోగించనున్నారు. దీని ద్వారా పీయూ వ్యర్థాల పునర్వినియోగంలో టాప్‌లో నిలువస్తుంది. న్యాక్ ర్యాంకింగ్‌లో మెరుగైన స్కోరింగ్ వచ్చే అవకాశం ఉంటుంది.

టాప్‌లో నిలబెడతాం..

పీయూనూ తెలంగాణలో టాప్ యూనివర్సిటీగా నిలబెట్టేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నాం. ఫైల్స్, సిబ్బంది అటెండెన్స్, విద్యార్థుల తదితర వివరాలు అన్ని సమర్థ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోకి తీసుకొస్తున్నాం. డ్రెయినేజీ నీరు వృథా పోకుండా సీవేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి.. నీటి పుర్వినియోగం, బయో ఫర్టిలైజర్స్ వినియోగంలోకి తీసుకువస్తాం. సోలార్ ప్యానెల్స్ ద్వారా కరెంట్ బిల్లు ఆదా అవుతుంది.

– జీఎన్ శ్రీనివాస్, పీయూ వైస్ చాన్స్‌లర్

పేపర్ లెస్ సేవలు..

యూనివర్సిటీలో పేపర్ లెస్ సేవలు నిర్వహించేందుకు సమర్థ్ పోర్టల్‌ను వినియోగిస్తున్నాం. దీని ద్వారా టీచింగ్, నాన్‌టీచింగ్, స్టూడెంట్స్ అందరికీ కూడా సులభంగా, వేగంగా సేవలు అందించేందుకు ఈ పోర్టల్ ఎంతో ఉపయోగపడుతుంది. వీలైనంత త్వరగా దీనిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తాం. వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌తో యూనివర్సిటీలో నీటి కొరత తీరడంతో పాటు మరిన్ని ప్రయోజనాలు కలగనున్నాయి.

– రమేష్‌బాబు, పీయూ రిజిస్ట్రార్

విద్యుత్ ఆదా..

యూనివర్సిటీలోని అన్ని విభాగాల్లో సోలార్ విద్యుత్ వినియోగించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా రూ.3 కోట్లతో అడ్మినిస్ట్రేషన్ భవనం పైభాగంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయించారు. వీటి ద్వారా యూనివర్సిటీలోని పలు విభాగాలకు సోలార్ విద్యుత్‌ను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఇది ప్రభుత్వం అందించే సాధారణ విద్యుత్‌తో కలుపుకొని అన్ని విభాగాలకు అందిస్తున్నారు. దీని ద్వారా యూనివర్సిటీకి తక్కువ కరెంట్ బిల్లు వస్తుందని అధికారులు చెబుతున్నారు. అయితే ఇది కొన్ని విభాగాలకు సరిపోవడం లేదని, దీనిని పూర్తిస్థాయిలో విస్తరించనున్నట్లు పేర్కొంటున్నారు.



రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీసీలో చూస్తున్న ఎంపీ డీకే అరుణ, కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు

- ఎంపీ డీకే అరుణ, కలెక్టర్ సిక్తా పట్నాయక్
- పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం ప్రారంభం

నారాయణపేట రూరల్: ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీకె అరుణ, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం, పప్పు ధాన్యాల మిషన్‌ను భారత ప్రధాని నరేంద్ర మోదీగా వర్చువల్‌గా శనివారం ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నారాయణపేట మండలంలోని జాజాపూర్ రైతువేదికలో ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరు కాగా.. కలెక్టర్ సిక్తా పట్నాయక్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, నోడల్ అధికారి సాయిబాబా, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకానికి దేశంలోని 100 జిల్లాలను ఎంచుకోగా అందులో నారాయణపేట స్థానం సంపాదించడం ఈ ప్రాంత అభివృద్ధికి శుభ పరిణామమన్నారు. రాష్ట్రంలో ఈ పథకం కింద నాలుగు జిల్లాలు ఎంపిక కాగా వాటిలో నారాయణపేట, నాగర్‌కర్నూల్, గద్వాల మూడు ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే ఉన్నాయని హర్షం వ్యక్తం చేశారు. పథకం అమలు కోసం ప్రతి ఏటా రూ.960 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన వాటిని పరిష్కరించేందుకు మోదీ సర్కార్ 2025 కేంద్ర బడ్జెట్‌లో పీఎం ధన్ ధాన్య కృషి యోజన కింద 100 ఆకాంక్షాత్మక వ్యవసాయ జిల్లాలను అభివృద్ధి చేస్తామని ప్రకటించిందన్నారు. గ్రామీణాభివృద్ధి, సహకారం, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, ఐసీఏఆర్, నీతి ఆయోగ్, నాబార్డ్ విభాగాలు రాష్ట్రాలు వాటి అనుబంధ మంత్రిత్వ శాఖలు, విభాగాలతో సన్నిహిత సహకారంతో పనిచేస్తుందని తెలిపారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం జిల్లాకు ఒక ప్రత్యేక జాయిన్ డైరెక్టర్‌ను నియమించిందని, వ్యవసాయ రంగంలోని 36 అంశాలకు సంబంధించి ఒక్కో అంశంపై ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక రూపొందించి కేంద్రానికి పంపిస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, బీజేపీ ముఖ్య నాయకులు నాగురావు నామాజీ, రతంగ్‌పాండురెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, వివిధ మోర్చాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సాగు ఉత్పాదకతను పెంచడం

కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకం కింద నారాయణపేట ఎంపిక కావడం ఈ ప్రాంత అభివృద్ధికి నాంది అన్నారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడం, పంట వైవిధ్యీకరణ, పంటల పెరుగుదల, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, పంటకోత తర్వాత నిల్వ, విలువ జోడింపును పెంచడం, నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపరచడం, దీర్ఘకాలిక, స్వల్పకాలిక క్రెడిట్‌ను సులభతరం చేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 2018–2019 నుంచి ఆస్పిరేషన్ బ్లాక్ కొనసాగుతోందని, 2021లో జిల్లాలోని నర్వ మండలం ఆ బ్లాక్ కింద ఎంపికై ందని, నీతి అయోగ్ ద్వారా రూ.2 కోట్ల నిధులు వచ్చాయని ఆమె తెలిపారు. వ్యవసాయ పరిశోధన, విద్య విభాగం, మత్స్య శాఖ, పశుసంవర్ధక మరియు పాడిపరిశ్రమ, సహకార మంత్రిత్వ శాఖ, జలవనరులు, నది అభివృద్ధి, గంగా పునరుజ్జీవన శాఖ, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ పథకం కింద పనిచేస్తాయన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి

నారాయణపేట: జిల్లాలో జరిగే నేరాల నియంత్రణపై దృష్టి సారించి పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని డీఎస్పీ ఎన్.లింగయ్య పోలీసు అధికారులకు సూచించారు. శనివారం పేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో డీఎస్పీ కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసుల్లో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులపై సీఐ, ఎస్‌ఐలను అడిగి తెలుసుకున్నారు.సామాజిక అంశాలు అయిన సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల పైన ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ముందస్తు భద్రతపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐ శివశంకర్, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, రాముడు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

పల్లి సాగు అంతంతే..

జిల్లాలో 8 వేల ఎకరాలకు తగ్గే అవకాశం ఉందని అంచనా

- 3 వేల ఎకరాలకు విత్తనాలు పంపిణీ చేసిన అధికారులు
- ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జోరందుకున్న సాగు
- వేధిస్తున్న అడవి పందుల బెడద
- ప్రత్యామ్నాయంగా పత్తి, ఆముదం, మొక్కజొన్న సాగుకు ఆసక్తి

గడిచిన మూడేళ్లలో సాగు (ఎకరాల్లో)	
2023	2024
10,250	13,425
2025 8,000 (అంచనా)	



మరికల్‌లో ట్రాక్టర్‌తో వేరుశనగ విత్తనాలు వేస్తున్న రైతు

మరికల్: అధిక వర్షాల కారణంగా ఖరీఫ్ సాగు చేసిన రైతులకు నష్టాలే మిగిలాయి. వాటిని భర్తీ చేసేందుకు యాసంగిలో వేరుశనగ సాగుపై రైతులు దృష్టి సారించారు. కానీ ఇప్పటికీ వర్షాల జోరు ఇప్పటికీ తగ్గకపోవడంతో వేరుశనగ వేసేందుకు సైతం రైతులు వెనకాడుతున్నారు. ఇప్పటికే పది రోజులుగా జిల్లాలో అక్కడక్కడ వేరుశనగ విత్తనాలు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. జిల్లాలో మరికల్, ధన్వాడ, దామరగిద్ద, మక్తల్, మద్దూరు, కోస్గి, నర్వ మండలాల్లో ఏటవాలు భూముల్లో ఎక్కువగా సాగు చేయగా.. ఇతర మండలాల్లో ఓ మోస్తరుగా వేరుశనగ సాగవుతోంది. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలు పెరిగినా రైతులు వేరుశనగ పంటపై ఎక్కువగా ఆసక్తి చూపడం లేదు. కొందరు రైతులు వేరుశనగ పంటలకు అడవి పందుల బెడద అధికంగా ఉంటుందని, మొక్కజొన్న, పత్తి, ఆముదం పంటల వైపు మొగ్గు చూపుతున్నారు.

తుంపర సేద్యంతో అధిక దిగుబడులు..

నీటి వనరులను బట్టి ఏటవాలు భూముల్లో నీటి తడులు ఇచ్చే సమయంలో పొలం కోతకు గురి కాకుండా తుంపర సేద్యంతో తడులు ఇస్తారు. ఇలా చేయడం వల్ల ఎకరాకు సరిపోయే నీటితో మూడు ఎకరాలు సాగు చేయొచ్చు. అంతే కాకుండా అధిక దిగుబడి వస్తుంది. ప్రధానంగా వానాకాలంలో పెసర, జొన్న సాగు చేసిన భూముల్లో వేరుశనగ వేస్తారు. మరికొన్ని భూములు ఏ పంట సాగు చేయకుండా దుక్కి దున్ని యాసంగిలో నేరుగా వేరుశనగ మాత్రమే సాగు చేస్తారు. అందువల్ల భూసారం కాపాడుకోవచ్చని రైతులు చెబుతున్నారు. దీంతో ఎకరాకు 30 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుందని, పెట్టుబడి పోనూ సుమారు రూ. 40 వేల వరకు చేతికి అందుతుండటంతో రైతులు యాసంగి వేరుశనగ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

విత్తనాల కోసం ఇతర జిల్లాలకు

ఉమ్మడి జిల్లాలో నాణ్యమైన వేరుశనగ విత్తనాలు లభించకపోవడంతో కొందరు రైతులు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, తిరుపతికి వెళ్లి కే6, 1694 రకాల విత్తనాలకు క్వింటాల్‌కు రూ.12 వేల చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు రైతులు మహబూబ్‌నగర్, గుత్తి, మదనాపురం, రాయిచూర్ తదితర ప్రాంతాల నుండి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. వనపర్తి విత్తనోత్పత్తి సంస్థలో కే6, కదిరి లేపాక్షి-1812 రకాల విత్తనాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎకరానికి 65 కిలోల విత్తనాలు అవసరం ఉండటంతో పెద్ద రైతులు మంచి విత్తనాల కోసం ఇతర జిల్లాలకు పరుగులు తీస్తున్నారు.

విత్తనాలు పంపిణీ చేశాం

జిల్లాలో 8 వేల ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేసే అవకాశం ఉంది. ఇందుకు గాను ప్రభుత్వం 3 వేల ఎకరాలకు సరిపడా విత్తనాన్ని అందించడంతో రైతులకు పంపిణీ చేశాం. ఇతర జిల్లాలో వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేసే రైతులు నాణ్యమైన వాటిని ఎంచుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం.

– జాన్‌సుధాకర్, జిల్లా వ్యవసాయధికారి, నారాయణపేట

కొనబోతే కొరివి.. అమ్మబోతే అడవి

వేరుశనగ రైతులు ప్రతి ఏడాది విచిత్ర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. విత్తనాలు కొనబోతే ధరలు ఆకాశన్నంటుతున్నాయి. అమ్మబోతే గిట్టుబాటు ధరలు లేక విలవిల్లాడే పరిస్థితి నెలకొంటుంది. జిల్లావ్యాప్తంగా వేరుశనగ విత్తనాలు కొనేందుకు వ్యాపారులను ఆశ్రయిస్తే డిమాండ్‌ను బట్టి ఆగస్టులో క్వింటాల్‌కు రూ.8 నుంచి రూ.9 వేల వరకు ఉండగా, సెప్టెంబర్‌లో రూ.9 నుంచి రూ.12 వేల పెంచారు. ప్రభుత్వం మాత్రం కేవలం 3 వేల ఎకరాలకు మాత్రమే విత్తనాలు పంపిణీ చేసింది. విత్తనాలు అందని రైతులు ఇతర జిల్లాలకు వెళ్లి అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. 2024 మార్చిలో రైతులు వేరుశనగను క్వింటాల్‌కు మార్కెట్‌లో రూ.4,100 నుంచి రూ. 7,600 వరకు విక్రయించారు.

క్లుప్తంగా

గడ్డిమందు తాగి మహిళ బలవన్మరణం

ఊట్కూరు: మండలంలోని ఎడవెల్లిలో మతిస్థిమితం లేని అంజమ్మ(35) ఒంటరి మహిళ గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అంజమ్మ తమ్ముడు రాజుతో కలిసి ఎడవెల్లిలో ఉండేది. తల్లిదండ్రులు లేనందున అంజమ్మ పోషణ రాజు చూస్తుండేవాడు. రాజు భార్య దసరా పండుగకు హైదరాబాద్‌కు వెళ్లింది. శుక్రవారం రాజు పొలానికి వెళ్లాడు. సాయంత్రం రాజు ఇంటికి వచ్చేసరికి అంజమ్మ నోటినుంచి నురుగ కక్కుతూ కనిపించింది. తమ్ముడు ఏమైందని అడగగా ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగానని చెప్పడంతో మక్తల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మహబూబ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు.

మద్యం మత్తులో కాల్వలో పడి వ్యక్తి మృతి

ఖిల్లాఘనపురం: మద్యం మత్తులో ప్రమాదవశాత్తు కాల్వలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఖిల్లాఘనపురం మండలం సోళీపురంలో శుక్రవారం చోటుచేసుకోగా శనివారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. సోళీపురం గ్రామానికి చెందిన మణెమ్మను గండేడ్‌కు చెందిన బుసాని వెంకటయ్య(35)కు ఇచ్చి 9ఏళ్ల కిందట వివాహం చేశారు. శుక్రవారం భర్తతోపాటు చెల్లెలు శిరీష మరి కొంత మంది బంధువులతో కలిసి సోళీపురం వచ్చారు. అక్కడ మద్యం తాగిన వెంకటయ్య గ్రామంలోకి వెళ్లాడు. వెతికి ఇంటికి తీసుకొచ్చినా.. మళ్లీ కొంతసేపటికే గ్రామంలోకి వెళ్లి సోళీపురం–రుక్కన్నపల్లికి వెళ్లే దారిలో ఓ చిన్నపాటి నీటి కాల్వలో బోర్లాపడి మృతిచెందాడు. చాలాసేపటికి భర్త ఇంటికి రాకపోవడంతో భార్య, కుటుంబ సభ్యులు కలిసి వెతికారు. బస్టాండు వద్ద కాల్వలో ఎవరో ఓ వ్యక్తి పడి మృతిచెంది ఉన్నాడనే వార్త తెలియడంతో అక్కడికెళ్లి పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి తన భర్తగా గుర్తించిన మణెమ్మ, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈ విషయమై శనివారం మృతిని భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటో నుంచి జారిపడి వృద్ధుడి దుర్మరణం

ఎర్రవల్లి: ఆటో నుంచి జారిపడి వృద్ధుడు మృతిచెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని దువాసిపల్లికి చెందిన హరిజన పెద్ద బీసన్న(70) పని నిమిత్తం ఎర్రవల్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి ఓ ఆటోలో బయలుదేరాడు. ఆటో సాసనూలు సమీపంలో వెళ్తుండగా.. ఒక్కసారిగా జారి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన గద్వాల ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు కర్నూల్‌కు తరలించారు. అప్పటికే మృతిచెందాడని డ్యూటీ డాక్టర్ ధ్రువీకరించినట్లు తెలిపారు. మృతుడికి భార్య లచ్చమ్మ, నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నవాబుపేట: మండలంలోని ఎర్రవాడ్క తండా కు చెందిన గిరిజన వ్యక్తి కుటుంబ పోషణ కో సం అప్పు చేసి తీరా వాటిని తీర్చటం భారంగా మారడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ యన భార్య తెలిపిన వివరాల ప్రకారం.. గిరిజనతండాకు చెందిన వ్యక్తి విస్లావత్ పాండునాయక్(45) జీవనోపాధి కోసం 8 ఏళ్లుగా కు టుంబంతో షాద్‌నగర్‌లో అద్దెకు ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించాడు. కొన్ని నెలలుగా కుటుంబ పోషణకు అప్పులు చేశా డు. దీంతో ఈ నెల 10న ఆయన మళ్లీ వస్తానంటూ బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆయన కో సం ఎదురు చూసినా ఆయన ఆచూకీ లభించలేదు. శనివారం తండా సమీపంలో చెట్టుకు ఉరేసుకొని వేలాడుతుండగా గ్రామస్తులు చూ సి భార్యకు సమాచారం అందించారు. భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

షుగర్ ఫ్యాక్టరీ కూలీలకు అస్వస్థత

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని అప్పరాల గ్రామ శివారులోని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్ట రీలో ఏడుగురు కూలీలు స్వల్ప అస్వస్థకు గురయ్యారు. ఫ్యాక్టరీలో డిస్టరీ బిట్ యూనిట్‌లోకి దిగి శుభ్రం చేస్తుండగా కళ్లు తిరిగి పడిపోయా రు. గమనించిన తోటి కూలీలు ఫ్యాక్టరీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అస్వస్థతకు గురైన కూలీలను కొత్తకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించిన వైద్యులు ప్రమాదం ఏం లేదని నిర్ధారించారు. అనంతరం వనపర్తిలోని ఓ కంటి ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అస్వస్థతకు గురైన వారి లో ఆరుగురు కూలీలకు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సనోజ్, ధర్మేందర్, కైలుకుమార్, అనూజ్‌భారతి, విజయ్, ప్రింట్ కుమార్‌తోపా టు ఆత్మకూర్ మండలం ఆరేపల్లికి చెందిన తెలుగు శ్రీకాంత్ ఉన్నారు. కూలీలకు ఎలాంటి ఇబ్బంది లేదని, ఆరోగ్యంగా ఉన్నట్లు ఫ్యాక్టరీ నిర్వాహకులు తెలిపారు.

ఫైనల్లో పాలమూరు- పేట


బాలుర విభాగం మహబూబ్‌నగర్-ఖమ్మం జట్ల సెమీఫైనల్ మ్యాచ్


నాగర్‌కర్నూల్-ఆదిలాబాద్ జట్ల మధ్య బాలికల మ్యాచ్

- ఉత్సాహంగా సాగుతున్న నెట్‌బాల్ టోర్నీ
- బాలికల ట్రెడిషనల్ ఫైనల్లో రంగారెడ్డి, నల్లగొండ
- ప్రారంభమైన ఫాస్ట్–5 పోటీలు
- నేడు ముగియనున్న జూనియర్ చాంపియన్‌షిప్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ ఉత్సాహంగా జరుగుతోంది. ట్రెడిషనల్ విభాగం పోటీలు ఉత్కంఠంగా సాగాయి. ఈ విభాగంలో ఆతిథ్య మహబూబ్‌నగర్ బాలుర జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి తుది సమరానికి చేరుకుంది. ఫైనల్లో నారాయణపేట జిల్లా జట్టుతో తలపడనుంది. ఇక బాలికల్లో రంగారెడ్డి, నల్లగొండ జట్లు ఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగం మూడో స్థానంలో ఖమ్మం, జనగాం జట్టు, బాలికల విభాగంలో నిజామాబాద్, మహబూబ్‌నగర్ జట్లు సంయుక్తంగా నిలిచాయి. నేడు ఈ మెగా టోర్నీ ముగియనుంది.

సెమీఫైనల్ ఫలితాలు: బాలుర మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ బాలుర జట్టు 16–11 పాయింట్ల తేడాతో ఖమ్మం జట్టుపై విజయం సాధించింది. మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో నారాయణపేట జట్టు 18–12 తేడాతో జనగాం జట్టుపై గెలిచింది. బాలికల విభాగం సెమీఫైనల్ మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు 11–6 పాయింట్ల తేడాతో నిజామాబాద్ జట్టుపై, నల్గొండ జట్టు 15–11 తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొందాయి.

క్వార్టర్ ఫలితాలు: బాలుర విభాగం క్వార్టర్‌ఫైనల్ మ్యాచుల్లో ఖమ్మం జట్టు 21–11 పాయింట్ల తేడాతో నల్లగొండ జట్టుపై, నారాయణపేట జట్టు 23–7 తేడాతో హైదరాబాద్‌పై, మహబూబ్‌నగర్ జట్టు 18–02 తేడాతో గద్వాల జట్టుపై, జనగాం జట్టు 14–12 తేడాతో నాగర్‌కర్నూల్ జట్టుపై విజయం సాధించాయి. బాలికల విభాగం క్వార్టర్ ఫైనల్ మ్యాచుల్లో రంగారెడ్డి జట్టు 12–5 పాయింట్ల తేడాతో మేడ్చల్ జట్టుపై, నల్లగొండ జట్టు 16–4 తేడాతో ఖమ్మంపై, నిజామాబాద్ 19–14 తేడాతో కొమురంభీమ్ ఆసిఫాబాద్‌పై, మహబూబ్‌నగర్ జట్టు 13–3 తేడాతో నాగర్‌కర్నూల్ జట్టుపై గెలుపొందాయి.

ఫాస్ట్–5 పోటీలు ప్రారంభం

శనివారం బాలబాలికల విభాగం ఫాస్ట్–5 పోటీలు ప్రారంభమయ్యాయి. బాలుర విభాగం నాకౌట్ మ్యాచుల్లో కొమురంభీమ్ ఆసిఫాబాద్ జట్టు 22–13 తేడాతో మెదక్ జట్టుపై, కరీంనగర్ జట్టు 22–10 తేడాతో కొత్తగూడెంపై, వనపర్తి జట్టు 10–3 తేడాతో వరంగల్‌పై, మేడ్చల్ జట్టు 11–3 తేడాతో రంగారెడ్డిపై, హైదరాబాద్ జట్టు 34–6 తేడాతో నిర్మల్‌పై విజయం సాధించాయి. బాలికల విభాగంలో జగిత్యాల జట్టు 10–4 తేడాతో జనగాంపై, మహబూబ్‌నగర్ 16–4 తేడాతో మహబూబాబాద్‌పై, కామారెడ్డి జట్టు 7–3 తేడాతో వికారాబాద్‌పై, నాగర్‌కర్నూల్ 14–4 తేడాతో మంచిర్యాలపై, ఖమ్మం జట్టు 11–4 తేడాతో కొమురంభీమ్ ఆసిఫాబాద్‌పై గెలుపొందాయి. అంతకుముందు ఫాస్ట్–5 మ్యాచ్ జట్లను నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ కార్యదర్శి శిరీషారాణి పరిచయం చేసుకున్నారు. టోర్నీలో ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలి

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి
- బల్క్ డ్రగ్ అసోసియేషన్‌తో ఎంఓయూ కుదుర్చుకున్న అధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. శనివారం బల్క్ డ్రగ్ మాన్యుఫాక్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీయూలోని ఫార్మసీ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పెద్ద కంపెనీలతో చర్చించి ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు ఏర్పాటు చేస్తోందన్నారు. అందులో భాగంగా పీయూలో ఏర్పాటు చేసిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు పలు కంపెనీల ప్రతినిధులు రావడం గొప్ప విషయమన్నారు. తెలంగాణ ఫార్మ కంపెనీలు ప్రపంచం, దేశంలోనే నంబర్ వన్ కంపెనీలుగా ఎదుగుతున్నాయని.. వీటి ద్వారా వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు.

పీయూ వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ..

జిల్లాలో ఎంతో మంది యువత నైపుణ్యాలు కలిగి ఉన్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పీయూలో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ అవకాశం కల్పించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బల్క్ డ్రగ్ మాన్యుఫాక్చర్ అసోసియేషన్‌తో పీయూ అధికారులు ఎంఓయూ కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, బల్క్ డ్రగ్ మాన్యుఫాక్చర్ అసోసియేషన్ డైరెక్టర్ రోజా రమణి, ప్రిన్సిపాల్స్ మధుసూదన్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రవికాంత్, ప్లేస్‌మెంట్ అధికారి అర్జున్‌కుమార్, భూమయ్య, ప్రభాకర్‌రెడ్డి, సిలాస్, గురుస్వామి, చిన్నాదేవి, స్వాతి పాల్గొన్నారు.



రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డిని సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్ తదితరులు

జూరాలకు 62 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- ప్రాజెక్టు 3 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 65,140 క్యూసెక్కుల నీరు దిగువకు

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతున్నట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి 9 గంటల వరకు 79 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శనివారం రాత్రి 8.30 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 62 వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని అన్ని ఎత్తిపోతల పథకాలకు తాత్కాలికంగా నీటి విడుదలను నిలిపివేశారు. దీంతో ప్రాజెక్టు కేవలం 3 క్రస్టు గేట్లను ఎత్తి 18,384 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 45,055 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 600 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 65,140 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.132 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

వేగవంతంగా విద్యుదుత్పత్తి

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 408.044 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 394.443 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో కలిపి 802.487 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

శ్రీశైలం ఆనకట్ట ఒక గేటు ఎత్తివేత

దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టినా శ్రీశైలం జలాశయంలో పూర్తి స్థాయి నీటిమట్టానికి మించి నీరు నిల్వ ఉండడంతో సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 63,439 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 11,238, హంద్రీ నుంచి 250 మొత్తం 74,927 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తోంది. శ్రీశైలంలో ఆనకట్ట వద్ద ఒక్క గేటును పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 27,983 క్యూసెక్కుల నీటిని దిగువున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,819 మొత్తం 66,134 క్యూసెక్కుల నీటిని అదనంగా సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.8 అడుగుల వద్ద 214.8450 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 5 వేలు, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,835, ఎంజీకేఎల్ఐకు 866 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.990 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 13.747 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.


శ్రీశైలం ఆనకట్ట

రైల్వే ఉద్యోగిని మోసం చేసిన సైబర్ నేరస్తులు

నాగర్‌కర్నూల్ క్రైం: వాట్సప్‌లో వచ్చిన ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో నగదు వస్తుందని పెట్టుబడి పెట్టిన రైల్వే ఉద్యోగిని సైబర్ నేరస్తులు మోసం చేసిన ఘటన చోటు చేసుకున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన తిరుపతయ్య రైల్వే ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడు తన ఫోన్‌లోని వాట్సాప్‌కు వచ్చిన మెసేజ్‌లో ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెడితే డబుల్ అమౌంట్ వస్తుందని నమ్మి ఈ ఏడాది ఆగస్టు రూ. 13.5 లక్షల వరకు పెట్టుబడిగా పెట్టాడు. తాను పెట్టుబడి పెట్టిన నగదు రాకపోవడంతో వాట్సప్‌కు వచ్చిన ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయడంతో సైబర్ నేరస్తులు స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లక్ష్మమ్మకు మాజీ మంత్రుల ఘన నివాళి

తిమ్మాజీపేట: మాజీ మంత్రి డా. ఆవంచ లక్ష్మారెడ్డి తల్లి లక్ష్మమ్మ ఈ నెల 1న హైదరాబాద్‌లో మృతిచెందగా.. స్వగ్రామం ఆవంచలో దహన సంస్కారాలు నిర్వహించారు. శనివారం గ్రామంలో నిర్వహించిన దశదినకర్మలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలుజల్లి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, యాదయ్య, శ్రీశైలంయాదవ్, దయాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌గౌడ్, మోహనాచారి, అజయ్, ఊషన్న, కృష్ణయ్య, ఇబ్రహీం, స్వామి, సైఫ్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధదంపతుల మృతదేహాలు లభ్యం

- బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పరామర్శ
- అంబటాపూర్‌కు బీటీరోడ్డు మంజూరు చేస్తామని హామీ

జడ్చర్ల: మండలంలోని కిష్టారం పోతిరెడ్డి చెరువు అలుగు ప్రవాహంలో గురువారం గల్లంతైన అంబటాపూర్‌కు చెందిన వృద్ధ దంపతుల మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. అంబటాపూర్‌కు చెందిన భార్యాభర్తలు బాలయ్య, రాములమ్మ ఉపాధి పనులకు సంబంధించిన కూలీ డబ్బులు బ్యాంకు ఖాతాలో పడ్డాయోనని తెలుసుకోవడానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా.. వరదలో రోడ్డు దాటుతూ గల్లంతైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు గల్లంతైన వారికోసం గాలించినా ఫలితం లేకపోయింది. శనివారం వరద ప్రవాహం గణనీయంగా తగ్గడంతో ఘటన స్థలానికి కొద్దిదూరంలో మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పరామర్శ

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శనివారం అంబటాపూర్‌లో మృతదేహాలను పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. భవిష్యత్‌లో ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని, అంబటాపూర్‌కు త్వరలోనే బీటీరోడ్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

వీకేర్ సీడ్స్‌లో పూర్తయిన ఐటీ సోదాలు

ఉండవెల్లి: మండలంలోని జాతీ య రహదారి పక్కన ఉన్న వీకేర్ సీడ్స్ ప్రైవేట్ కంపెనీలో మంగళవారం తెల్లవారుజాము నుంచి శనివారం వరకు ఆంధ్ర, తెలంగాణాకు చెందిన ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. గుట్టుచప్పుడు కాకుండా ఉద్యోగులను ఇళ్ల నుంచి తీసుకొచ్చి మరీ డాక్యుమెంట్లు, పత్రాలు, కంప్యూటర్లు, లాకర్లు, బీర్వాలు పరిశీలించారు. చివరకు ఎలాంటివి పట్టుబడలేదని శనివారం తెల్లవారుజామున వెళ్లిపోయారు. గురువారం యాజమాన్యంలో భాగమైన కిరణ్ కుమారుడిని శుక్రవారం ఇద్దరు యజమానులు దూడెంపూడి కిరణ్‌కుమార్, ధూళిపాల వెంకట్రావును విచారించారు. మిగిలిన ఇద్దరు ధూళిపాల కోటిస్వామి, బాబాయ్య హాజరుకాలేదని సమాచారం. కాగా రైతులు వీకేర్‌కు రావాలంటేనే భయపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధాన్యాన్ని శనివారం తరలించడం ప్రారంభించారు.



కంటివైద్యుడి అదృశ్యంపై వీడిన మిస్టరీ


వివరాలు వెల్లడిస్తున్న కోస్గి సీఐ సైదులు.. ఎస్ఐ విజయ్‌కుమార్, కంటి వైద్యుడు రమేశ్‌నాయక్

- విలేకర్ల ఎదుట హాజరుపర్చిన పోలీసులు

మద్దూరు: పట్టణంలో కంటి ఆస్పత్రి నిర్వహిస్తున్న కంటివైద్యుడు పాత్లావత్ రమేశ్‌నాయక్ ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ 17 పేజీల లేఖ రాసి గత నెల 28న అదృశ్యమైన విషయం పాఠకులకు విధితమే. శనివారం హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు బస్సులో వస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు మార్గమధ్యంలో పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విలేకర్ల ఎదుట ప్రవేశపెట్టారు. మతమార్పిడులు, దొంగ బంగారం, హవాల తదితర అంశాలు ఊహించి రాసి డబ్బుల గురించి వేధించే వారికి తగిన గుణపాఠం చెప్పాలనే ఉద్దేశంలో ఇదంతా చేసినట్లు విచారణలో వెల్లడైందని కోస్గి సీఐ సైదులు తెలిపారు. రమేష్‌నాయక్‌ను తహసీల్దార్ ఎదుట హాజరుపర్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. న్యాయ సలహా మేరకు కేసుపై తదుపరి చర్యలుంటాయని చెప్పారు. రమేష్‌నాయక్‌ను పట్టుకునేందుకు కృషిచేసిన టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పురుషోత్తం, మద్దూరు ఎస్ఐ విజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ వసురాం నాయక్, పోలీసులు పరశురాంనాయక్, నాగ మల్లేష్, పూల్యానాయక్, రాఘవేందర్‌రెడ్డి, హన్మంతు తదితరులను సీఐ అభినందించారు.

వేధింపులతోనే ఇదంతా చేశా..

కంటి వైద్యుడు రమేష్‌నాయక్ పోలీసుల ఎదుట జరిగిన విషయాన్ని విలేకర్లకు వివరించారు. తన మిత్రుడు రామచంద్రయ్య గతంలో పట్టణంలోని తాజోద్దీన్ వద్ద రూ.10 లక్షలు అప్పు తీసుకోగా తాను జమానత్ ఉన్నానన్నారు. అప్పుల బాధ తట్టుకోలేక ఈ ఏడాది మే నెల 23న ఆత్మహత్య చేసుకున్నాడని.. తనను పిలిచి డబ్బులు చెల్లించాలంటూ తాజోద్దీన్ ఒత్తిడి పెంచి తరచూ వేధిస్తున్నట్లు వివరించారు. డబ్బులు చెల్లించాలని మళ్లీ స్నేహితుల సమక్షంలో మరో బాండ్ పేపర్ రాయించుకున్నారని, దీంతో చేసేది లేక నెల వడ్డీ చెల్లించినట్లు చెప్పారు. వేధింపులకు తట్టుకోలేక సినిమాల ప్రభావంతో మతమార్పిడులు, దొంగ బంగారం, హవాల డబ్బులు తదితర వాటిని పేర్కొంటూ లేఖ రాసినట్లు తెలిపారు.

రసాయనాలు కలిసిన నీరు తాగి నెమళ్లకు అస్వస్థత

- వనపర్తి ఎస్పీ చొరవతో పశువైద్యశాలకు తరలింపు
- పోలీసు, ఫారెస్టు అధికారుల పర్యవేక్షణలో చికిత్స

వనపర్తి: పంటపొలంలో రసాయనాలు కలిసిన నీటిని తాగి అస్వస్థతకు గురైన మూడు నెమళ్లకు పశువైద్యులు చికిత్స అందించి ఊపిరి పోశారు. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుట్ల–తిరుమలాపురం రోడ్డు పక్కనున్న పొలంలో రైతు కంతుల కురుమయ్య మినుముల పంట సాగుచేశాడు. ఇటీవల పంటకు రసాయనిక ఎరువులు వేశాడు. శనివారం అటుగా వచ్చిన మూడు నెమళ్లు పొలంలో నిలిచి ఉన్న నీటిని తాగడంతో అస్వస్థతకు గురై కదలలేని పరిస్థితికి చేరుకున్నాయి. గమనించిన సమీప రైతులు ఫారెస్టు అధికారులు, పోలీసులతో పాటు స్నేక్ సొసైటీ వారికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ రావుల గిరిధర్ వెంటనే స్పందించి ఘటనా స్థలానికి గోపాల్‌పేట ఎస్ఐ నరేశ్‌తో పాటు ఎస్‌బీ కానిస్టేబుల్ బాలును పంపించారు. అక్కడికి వెళ్లిన వారు మూడు నెమళ్లు కదలలేని స్థితిలో ఉన్నాయని ఎస్పీకి సమాచారం ఇవ్వగా.. వెంటనే వాటిని వనపర్తి జిల్లా కేంద్రంలోని పశువైద్యశాలకు తీసుకురావాలని సూచించారు. వారు పశువైద్యశాలకు నెమళ్లను తీసుకొచ్చే వరకే ఆయన అక్కడికి చేరుకొని వెటర్నరీ డాక్టర్ మల్లేశ్, ఇతర సిబ్బందిని అప్రమత్తం చేశారు. నెమళ్లను తీసుకొచ్చిన వెంటనే చికిత్స మొదలుపెట్టారు. మరో మూడు, నాలుగు రోజుల పాటు పర్యవేక్షణలో ఉంచుకొని వైద్యం అందించాలని వైద్యుడు సూచించడంతో.. వనపర్తి ఫారెస్టు సెక్షన్ అధికారులు విజయ్, స్వప్నకు నెమళ్లను అప్పగించారు. వారు స్థానిక ఎకో పార్క్‌కు తరలించి తమ పర్యవేక్షణలో ఉంచుకున్నారు. అవి పూర్తిగా కోలుకున్న తర్వాత అటవీ ప్రాంతంలో వదిలిపెడతామని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. ఎక్కడైనా మూగజీవాలు ప్రాణాపాయ స్థితిలో ఉంటే వాటిని కాపాడే ప్రయత్నం చేయాలని ఆయన కోరారు.



18 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ఖిల్లాఘనపురం: మండల పరిధిలోని సోళీపురం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. పూర్తి వివరాలు.. శనివారం సాయంత్రం సమయంలో ఖిల్లాఘనపురం పోలీసులు గస్తీలో భాగంగా సోళీపురం మీదుగా వెళ్తుండగా ఊర్కొండ మండలం రేవల్లికి చెందిన గొడుగు కృష్ణ 40 బస్తాల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సుమారు 18 క్వింటాళ్ల బియ్యం, డ్రైవర్ కృష్ణను స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ధన్వాడ: మండలంలోని యంనోనిపల్లిలో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కర్ణాటకు తరలిస్తున్న వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. నర్వ మండలంలో పలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యం సేకరిస్తున్న బొలెరో వాహన డ్రైవర్ నరేందర్, యజమాని బాలరాజుపై కేసు నమోదు చేసి డీటీ పంచానామా నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ సురేష్ పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై ఆరు కార్లు ఢీ

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారుకు ఉత్తర ఫీడ్స్ వద్ద కుక్క అడ్డురాగా.. డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో వెనక ఉన్న మొత్తం 6 కార్లు ఒకదానికొకటి ఢీకొట్టుకోవడంతో రెండు కార్లు ధ్వంసం అయ్యాయి. కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే మార్గంలోని కార్లు జాతీయ రహదారిపై ఢీకొనడంతో వాహనాలు ఒక్కసారిగా నిలిచిపోయాయి. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అప్పటికే కార్లు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు.